రాజీవ్ యువ వికాసం స్కీమ్‌లో సిబిల్ స్కోర్ కీలకం కానుంది. ఈ పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వ సహాయంతో లోన్ పొందాలనుకునే నిరుద్యోగ యువతకు క్రెడిట్ స్కోర్‌ను ప్రధాన అర్హతగా నిర్ణయించారు. సిబిల్ స్కోర్ తక్కువగా ఉంటే లేదా గతంలో రుణాలు తీసుకుని చెల్లించకపోతే వారి దరఖాస్తులను బ్యాంకులు తిరస్కరించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. లోన్ అప్లికేషన్‌కు ముందు సిబిల్ స్కోర్‌ను బ్యాంకులు తప్పనిసరిగా పరిశీలిస్తున్నాయి. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో దానికి సంబంధించి ఫీజు కూడా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అప్లికేషన్‌కి రూ.200 వరకు వసూలు చేస్తున్న బ్యాంకులు ఉన్నట్లు సమాచారం. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అర్హుల జాబితాపై బ్యాంకర్లు కసరత్తు చేస్తున్నారు. బ్యాంకులకు కేటాయించిన లక్ష్యాల ప్రకారం.. దరఖాస్తుదారుల సిబిల్ స్కోర్, గతంలో తీసుకున్న రుణాల వివరాలను పరిశీలిస్తున్నారు. కుటుంబ సభ్యులు ఎవరైనా గత ఐదేళ్లలో కార్పొరేషన్ రుణాలు తీసుకున్నారా? అనే విషయాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటున్నారు. ఎందుకంటే ఐదేళ్లు పూర్తయితేనే వారు కొత్త రుణం పొందడానికి అర్హులు.

–ఖమ్మం, మే 27

- 'రాజీవ్ యువ వికాసం'లో కరువైన స్పష్టత
- రుణం పొందేందుకు బ్యాంకు లింకేజీ తప్పనిసరి
- దరఖాస్తుదారులకు కాంగ్రెస్ ప్రభుత్వం షాక్
- లోన్లు ఇప్పిస్తామని డబ్బులు వసూళ్లు చేస్తున్న కాంగ్రెస్ నేతలు
- ఖమ్మం జిల్లావ్యాప్తంగా 95,325 మంది దరఖాస్తు
- ప్రభుత్వ తీరుపై నిరుద్యోగ యువత ఆగ్రహం

# సిబిల్ లేకపోతే.. లోన్ రానట్టేనా?



దరఖాస్తు చేసుకునేందుకు కేఎంసీ మీ సేవ కేంద్రానికి పోటెత్తిన యువత (ఫైల్)



ఖమ్మం నగర పాలక సంస్థ మీ సేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకుంటున్న యువతీ యువకులు (ఫైల్)

మాజీ ప్రధాని, శాస్త్ర సాంకేతికరంగాన్ని ప్రోత్సహించిన వ్యక్తి రాజీవ్‌గాంధీ.. అంత గొప్ప వ్యక్తి పేరుతో రేవంత్‌రెడ్డి సర్కార్ తెలంగాణలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రవేశపెట్టింది. కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలను కల్పిస్తామని హామీలు ఇచ్చింది. తీరా అధికారంలోకి వచ్చాక ఆ హామీలను తుంగలో తొక్కి కేవలం ప్రకటనకే పరిమితమైంది. రోజుకొక నిబంధనతో నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుకుంటున్న రేవంత్ సర్కార్ తీరుపై నిరుద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాజీవ్ యువ వికాసం పథకం కింద లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ప్రస్తుతం తుది దశకు చేరుకుంది. ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో గత నెల 14 వరకు దరఖాస్తులను స్వీకరించారు. ఆ తరువాత వాటిని క్షుణ్ణంగా పరిశీలించి.. అర్హుల జాబితాను బ్యాంకర్లకు అందజేశారు. లబ్ధిదారులను ఎంపిక చేయడంలో బ్యాంకర్లు కీలకపాత్ర పోషిస్తున్నారు. ప్రస్తుతం ఆ ప్రక్రియలో నిమగ్నమై ఉన్నారు. ఐతే ఇప్పటికే గ్రామాలు, మున్సిపాలిటీల్లో ఇందిరమ్మ ఇండ్ల జాబితాను ఫైనల్ చేయడంలో కాంగ్రెస్‌కు చెందిన ఇందిరమ్మ కమిటీలు కీలకంగా వ్యవహరించాయి. కాంగ్రెస్ కార్యకర్తలకే ఇండ్లు మంజూరు చేసేలా వ్యవహరించారు. దీని ప్రభావంతో యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకున్న అనేక మంది నిరుద్యోగులు కాంగ్రెస్ నాయకుల చుట్టూ తిరుగుతున్నారు. ఇదే అదునుగా భావిస్తున్న కొంత మంది కాంగ్రెస్ నేతలు రుణం ఇప్పిస్తామని వారి నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అధికారులు అర్హత ప్రామాణికంగా రుణాలు మంజూరు చేయాలని దరఖాస్తుదారులు కోరుకుంటున్నారు.

### బ్యాంక్ లింకేజీ తప్పనిసరి..

తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పథకం రాజీవ్ యువ వికాసం స్కీమ్. ఈ పథకం కింద ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన యువతకు స్వయం ఉపాధి యూనిట్లు ఏర్పాటు చేసుకునేందుకు రాయితీపై రుణాలు అందిస్తున్నది. ఈ రుణాలు వివిధ వ్యాపారాలు, వృత్తుల కోసం ఇవ్వనున్నారు. తద్వారా యువత ఆర్థికంగా స్థిరపడటానికి సహాయపడుతుందనేది ప్రభుత్వ ఉద్దేశం. రాజీవ్ యువ వికాసం పథకం కింద మంజూరు చేసే యూనిట్లకు బ్యాంకు లింకేజీని ప్రభుత్వం తప్పనిసరి చేసింది. రాయితీపోను మిగతా వాటా భరించేందుకు లబ్ధిదారు సిద్ధంగా ఉన్నా యూనిట్లు మంజూరు చేయకూడదని నిర్ణయం తీసుకుంది. రాజీవ్ యువ వికాసం పథకం అమల్లో పారదర్శకత పెంచేందుకు, నిధులు పక్కదారి పట్టకుండా ఉండేందుకు ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం తీసుకుంది. ఇటీవల ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీ జిల్లా సంక్షేమ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఈ మేరకు స్పష్టత ఇచ్చింది. క్షేత్రస్థాయిలో పరిశీలన తరువాత అర్హుల జాబితాను బ్యాంకర్లకు పంపించి, ఆ యూనిట్లకు బ్యాంకు లింకేజీ తప్పనిసరి చేయాలని సూచనలు చేసింది.

### కేటగిరీల వారీగా దరఖాస్తుల స్వీకరణ ఇలా..

జిల్లావ్యాప్తంగా ఈ పథకం కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ వర్గాల నుంచి మొత్తం 95,325 దరఖాస్తులు వచ్చాయి. రాయితీ రుణాల కోసం తీవ్ర పోటీ నెలకొంది. ఎస్సీ విభాగంలో 29,742, బీసీ విభాగంలో 39,616, ఈబీసీ విభాగంలో 2,704, ఎంబీసీ విభాగంలో 1,228, మైనార్టీ విభాగంలో 7,412, క్రిస్టియన్ మైనార్టీ విభాగంలో 117 మొత్తం 95,325 దరఖాస్తులు వచ్చాయి. రాయితీ రుణాల మంజూరులో ఉన్న కొన్ని నిబంధనలు దరఖాస్తుదారులను కలవరపరుస్తున్నాయి. గ్రామంలో ఒకే రకమైన యూనిట్‌కు ఒకరికి మాత్రమే అర్హత ఉండటంతో ఎవరికి అవకాశం వస్తుందోననే సందిగ్ధత నెలకొంది. రాజీవ్ యువ వికాసం పథకం కింద నాలుగు కేటగిరీల్లో దరఖాస్తులను స్వీకరించారు. ఇందులో కేటగిరీ–1 కింద రూ.50 వేల విలువైన యూనిట్‌కు నూరు శాతం రాయితీ కల్పించగా.. బ్యాంకు లింకేజీ లేకుండా ఈ రుణాన్ని అమలు చేయాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కేటగిరీ–2, 3, 4లలో యూనిట్ వ్యయంలో రాయితీ తీసివేయగా, లబ్ధిదారు వాటా కింద బ్యాంకు రుణం తీసుకోవాలి. కేటగిరీ–2 కింద యూనిట్ వ్యయం రూ.లక్షలో 10 శాతం, కేటగిరీ–3 కింద రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు 20 శాతం, కేటగిరీ–4 కింద రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు 30 శాతం చొప్పున బ్యాంకు లింకేజీ తప్పనిసరి. రాజీవ్ యువ వికాసం పథకం కింద తొలి విడతలో భాగంగా రూ.లక్షలోపు రుణాలు మంజూరు చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. జూన్ 2వ తేదీన అర్హులైన వారికి మంజూరు పత్రాలు అందజేసే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.




- గుండెపోటుతో మృతిచెందిన వైరా మాజీ శాసన సభ్యుడు
- వైరా నియోజకవర్గంలో విషాదఛాయలు
- శోకసంద్రమైన 'ఈర్లపూడి'
- భౌతికకాయాన్ని దర్శించిన పలువురు ప్రముఖులు
- భారీగా తరలివచ్చిన అభిమానులు, గులాబీ శ్రేణులు
- ఫోన్‌లో కుటుంబ సభ్యులను పరామర్శించిన కేసీఆర్
- అకాలమరణం పట్ల విచారం



వైరా మాజీ ఎమ్మెల్యే బానోతు మదన్‌లాల్ (ఫైల్)

# మదన్‌లాల్ ఇకలేరు..

ఖమ్మం, మే 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గ మాజీ శాసనసభ్యుడు, బీఆర్ఎస్ వైరా నియోజకవర్గ ఇన్‌చార్జి బానోతు మదన్‌లాల్ గుండెపోటుతో సోమవారం అర్ధరాత్రి మృతిచెందారు. హైదరాబాద్‌లోని ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. పూర్తి వివరాల్లోకెళ్తే.. కొద్దిరోజులక్రితం వాంతులు, విరేచనాలు కావడంతో కుటుంబ సభ్యులు ఆయనను తొలుత ఖమ్మంలోని దవాఖానలో చికిత్స అందించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ ఏఐజీకి తరలించారు. చికిత్స పొందుతుండగానే సోమవారం అర్ధరాత్రి గుండెపోటుకు గురై మృతిచెందారు.

### బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ విచారం

ఖమ్మం, మే 27: వైరా మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ మృతికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సంతాపం తెలిపారు. మంగళవారం ఖమ్మం నగరంలోని మదన్‌లాల్ ఇంటి వద్ద నుంచి ఎంపీ వద్దిరాజు రవిచంద్ర బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ఫోన్ చేసి మదన్‌లాల్ కుమారుడు మృగేందర్‌లాల్‌తో మాట్లాడించారు. ఈ సందర్భంగా కేసీఆర్ మృగేందర్‌లాల్‌తో మాట్లాడుతూ 'మీ తండ్రి మదన్‌లాల్ నాకు సన్నిహితుడు, నిబద్ధత కలిగిన మంచి నాయకుడు, ఆయన అకాల మరణం తీవ్ర బాధాకరం' అని అన్నారు. మదన్‌లాల్ ఇక లేరనే నిజాన్ని నమ్మలేకపోతున్నానని, ఆయన మృతిచెందారని తెలియగానే దిగ్భ్రాంతికి లోనయ్యానని మృగేందర్‌లాల్‌తో చెప్పారు. మృగేందర్‌ను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. తల్లి మంజుల, చెల్లెలు మనీషా లక్ష్మీలను ఓదార్చుతూ వారికి మనోధైర్యాన్ని ఇవ్వాల్సిందిగా, కుటుంబానికి తాను, పార్టీ నాయకులు కొండంత అండగా ఉంటామని భరోసానిచ్చారు.



బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ధైర్యం చెబుతుండగా వద్దిరాజు ఫోన్ ద్వారా వింటున్న మదన్‌లాల్ కుమారుడు మృగేందర్‌లాల్




మదన్‌లాల్ నివాసం వద్ద కార్యకర్తలు, భౌతికకాయం వద్ద విషణ్ణవదనంతో కుటుంబసభ్యులు

ఖమ్మం/ రఘునాథపాలెం, మే 27: మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్ మరణవార్త తెలుసుకున్న పలు పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు పెద్దఎత్తున ఖమ్మం నగరానికి తరలివచ్చి నివాళులు అర్పించారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఖమ్మం మాజీ పార్లమెంటు సభ్యుడు నామా నాగేశ్వరరావు, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఖమ్మంలోని మదన్‌లాల్ ఇంటికెళ్లి భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మదన్‌లాల్ కుమారుడు ఐఏఎస్ మృగేందర్‌లాల్‌ను ఓదార్చారు. కుటుంబ సభ్యులను పరామర్శించి మదన్‌లాల్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. నివాళులు అర్పించిన వారిలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి రెడ్యానాయక్, మాజీ ఎమ్మెల్యేలు రాములునాయక్, మెచ్చా నాగేశ్వరరావు, కొండబాల కోటేశ్వరరావు, రేగా కాంతారావు, కందాళ ఉపేందర్‌రెడ్డి, బానోత్ హరిప్రియ, జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, భద్రాద్రి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దిండిగాల రాజేందర్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు ఆర్జేసీ కృష్ణ, బీరెడ్డి నాగచంద్రారెడ్డి, పార్టీ ఖమ్మం నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, కర్నాటి కృష్ణ, అజ్మీరా వీరూనాయక్, బొమ్మెర రామ్మూర్తి, వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, బీఆర్ఎస్ నాయకులు తాళ్లూరి జీవన్ కుమార్, బాణాల వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీలు కట్టా కృష్ణార్జున రావు, సామినేని హరిప్రసాద్, వైరా మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు, మోరంపూడి ప్రసాదరావు, గొడ్డేటి మాధవ రావు, బత్తుల శ్రీను, వాకదాని కోటేశ్వరరావు, ఏదునూరి శ్రీను, పాల్వంచ రాజేష్, సరిపూడి గోపి సందేశ్, రేగళ్ల కృష్ణ ప్రసాద్, రాంబాబు, నరేష్ తదితరులు ఉన్నారు.

### మదన్‌లాల్ ప్రస్థానం..

తొలుత వామపక్ష పార్టీల్లో పనిచేసిన మదన్‌లాల్ స్వగ్రామం రఘునాథపాలెం మండలం ఈర్లపూడి. ఈర్లపూడి ఎంపీటీసీగా, సర్పంచ్‌గా పలు పర్యాయాలు పనిచేశారు. అనంతరం 2012లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ తరఫున వైరా నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. అనంతరం బీఆర్ఎస్‌లోకి మారారు. 2018, 2023 శాసనసభ ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. ప్రస్తుతం మదన్‌లాల్ బీఆర్ఎస్ వైరా నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్నారు. మదన్‌లాల్ కుమారుడు బానోతు మృగేందర్‌లాల్ తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరు జిల్లా కమర్షియల్ ట్యాక్స్ జాయింట్ కమిషనర్‌గా పనిచేస్తున్నారు. కోడలు సైతం తమిళనాడు క్యాడర్‌లో ఐఏఎస్ ఆఫీసర్‌గా ఉన్నారు. మదన్‌లాల్ ఆకస్మిక మృతితో వైరా నియోజకవర్గ వ్యాప్తంగా విషాదఛాయలు అలుముకున్నాయి. స్వగ్రామం ఈర్లపూడి గ్రామం శోకసంద్రమైంది. మదన్‌లాల్ భౌతికకాయాన్ని హైదరాబాద్ నుంచి ఖమ్మం నగరంలోని అతడి ఇంటి వద్దకు తీసుకురాగా అభిమానులు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు తండోపతండాలుగా తరలివచ్చారు. మదన్‌లాల్ భౌతిక కాయాన్ని సందర్శించి కన్నీమున్నీరుగా రోదించారు.

### నేడు అంత్యక్రియలు


మదన్‌లాల్ స్వగ్రామమైన రఘునాథపాలెం మండలం ఈర్లపూడిలో బుధవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మదన్‌లాల్‌కు ఆరుగురు సోదరులు, ఐదుగురు అక్కాచెల్లెళ్లు కాగా మదన్‌లాల్ మూడోవాడు. హైదరాబాద్ డీఏస్పీగా ఉన్న మదన్‌లాల్ సోదరుడు బానోతు జవహర్‌లాల్ మూడునెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విషయం విదితమే. ఇప్పుడు మదన్‌లాల్ ఆకస్మిక మృతి ఆ కుటుంబానికి తీరని శోకాన్ని మిగిల్చింది.

### ఈర్లపూడికి రానున్న హరీశ్‌రావు

మదన్‌లాల్ అంత్యక్రియలకు రాష్ట్ర మాజీ మంత్రి హరీశ్‌రావు బీఆర్ఎస్ ప్రతినిధిగా హాజరుకానున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు మంగళవారం తెలిపారు. హరీశ్‌రావుతోపాటు రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు హాజరుకానున్నట్లు తెలిపారు.

### తాతా మధు, చంద్రావతి సంతాపం

మదన్‌లాల్ మృతి అత్యంత బాధాకరమని, వైరా నియోజకవర్గంలోని బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మదన్‌లాల్ మృతికి తన ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నట్లు వైరా మాజీ ఎమ్మెల్యే బానోత్ చంద్రావతి అమెరికా నుంచి ఒక ప్రకటన విడుదల చేసింది. దశాబ్దానికి పైగా కలిసి పనిచేశామని, మంచి నాయకుడిని కోల్పోవడం బాధాకరమని పేర్కొన్నారు.



బానోతు మదన్‌లాల్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు, మాజీ మంత్రి అజయ్, చిత్రంలో జడ్పీ మాజీ చైర్మన్ కమల్‌రాజు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు నాగరాజు

# సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- జూన్ 3 నుంచి ఉదయం 9:30 - మధ్యాహ్నం 12:30 మధ్య పరీక్షలు
- జిల్లాలో ఐదు కేంద్రాల్లో మొత్తం 1,367 మంది విద్యార్థులకు ఎగ్జామ్స్
- టెన్త్ పరీక్షల సమన్వయ సమావేశంలో భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్

కొత్తగూడెం గణేశ్ టెంపుల్, మే 27: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. టెన్త్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై ఐడీవోసీలో జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 3 నుంచి 13 వరకు ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్ష నిర్వహణ ఉంటుందని, ఇందుకోసం జిల్లా ఐదు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మొత్తం 1,367 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్న నేపథ్యంలో అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఐదుగురు చీఫ్ సూపరింటెండెంట్లు, ఐదుగురు డిపార్ట్‌మెంటల్ అధికారులు, ఇద్దరు ఫ్లయింగ్ స్క్వాడ్, ఐదుగురు సిట్టింగ్ స్క్వాడ్, 50 మంది ఇన్విజిలేటర్లను నియమించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు గంట ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. డీఈవో వెంకటేశ్వరాచారి, జిల్లా వైద్యాధికారి భాస్కర్‌నాయక్, విద్యుత్, పోస్టల్, మున్సిపల్, పంచాయతీ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్

## రేపటి నుంచి సప్లిమెంటరీ స్పాట్

- ఖమ్మం నయాబజార్ జూనియర్ కళాశాలలో నిర్వహణ
- జిల్లాలో ముగిసిన ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు..

ఖమ్మం అర్బన్, మే 27: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల ప్రశ్నపత్రాల వాల్యుయేషన్ ప్రక్రియలో భాగంగా ఈ నెల 29 నుంచి స్పాట్ ప్రారంభం కానుంది. ఖమ్మం నయాబజార్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మూల్యాంకనం నిర్వహించనున్నారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరాల సమాధాన పత్రాలను వాల్యుయేషన్ చేసేందుకు ఏఈలు, సీఈలు, సబ్జెక్టు ఎక్స్‌పర్ట్స్, స్క్రూటినైజర్లకు ఉత్తర్వులు అందజేశారు. ఈ నెల 29 నుంచి ప్రారంభమయ్యే ఫస్ట్ స్పెల్‌లో సంస్కృతం, ఆంగ్లం, తెలుగు, హిందీ, గణితం (1, 2) పొలిటికల్ సైన్స్ సబ్జెక్టులలో ప్రథమ, ద్వితీయ సంవత్సరాలు ఉన్నాయి. ఈ నెల 31 నుంచి రెండో స్పెల్ ప్రారంభం కానుంది. రెండో స్పెల్‌లో ఫిజిక్స్, ఎకనమిక్స్, బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ, కామర్స్, హిస్టరీ సబ్జెక్టులు ఉన్నాయి. ఫస్ట్ స్పెల్‌లో పాల్గొనే అధ్యాపకులు బుధవారం నయాబజార్ కాలేజీలోని క్యాంపులో రిపోర్ట్ చేయాలని డీఐఈవో, క్యాంపు ఆఫీసర్ కే.రవిబాబు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

**జిల్లాకు 69,835 సమాధాన పత్రాలు..**

ఖమ్మం, భద్రాద్రి జిల్లాల పరిధిలో ఖమ్మంలోనే స్పాట్ వాల్యుయేషన్ ప్రక్రియ కొనసాగనుంది. ఈ నేపథ్యంలో భద్రాద్రి జిల్లాకు చెందిన అధ్యాపకులకు ఖమ్మంలోని స్పాట్‌లో పాల్గొనేలా ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల అధ్యాపకులను ఎంపిక చేశారు. సప్లిమెంటరీ స్పాట్‌లో జిల్లాకు 69,835 సమాధాన పత్రాలు చేరాయి. ప్రథమ సంవత్సరంలో 53,279 సమాధాన పత్రాలు కాగా, ద్వితీయ సంవత్సరంలో 16,556 సమాధాన పత్రాలు ఉన్నాయి. అత్యధికంగా గణితం–1ఏలో 7,913 సమాధాన పత్రాలు, కెమిస్ట్రీ–1లో 7,684 సమాధాన పత్రాలు ఉన్నాయి. అత్యల్పంగా హిస్టరీ–2లో 49 సమాధాన పత్రాలు ఉన్నాయి.

**ముగిసిన ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు..**

ఈ నెల 22న ప్రారంభమైన ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు మంగళవారంతో ముగిశాయని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి కే.రవిబాబు తెలిపారు. రెండు సెషన్లలో ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలు నిర్వహించారు. మంగళవారం కెమిస్ట్రీ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు చెప్పారు.

## టెన్త్ సప్లీకి 1,048 మంది విద్యార్థులు

**ఖమ్మం జిల్లాలో మూడు ఎగ్జామ్ సెంటర్లు**

ఖమ్మం అర్బన్, మే 27: టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు పూర్తి ఏర్పాట్లు చేసినట్లు ఖమ్మం డీఈవో సామినేని సత్యనారాయణ తెలిపారు. జూన్ 3 నుంచి ప్రారంభమయ్యే పరీక్షలకు ఖమ్మం నగరంలో ఎన్ఎస్‌సీ కాలనీ, రిక్కాబజార్, శాంతినగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు కేంద్రాలుగా ఉన్నాయి. 1,048 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. రూ.50 ఆలస్య రుసుంతో పరీక్ష తేదీకి రెండురోజుల ముందు వరకు పరీక్ష రుసుం చెల్లించే వెసులుబాటు కల్పించినట్లు డీఈవో పేర్కొన్నారు.

## కష్టపడి చదివితే మంచి ఫలితం: పీవో

పాల్వంచ, మే 27: పదో తరగతిలో ఫెయిల్ అయ్యామని బాధపడకుండా కష్టపడి చదివితే మంచి ఫలితం దక్కుతుందని, సెలవులను వృథా చేయకుండా విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. పాల్వంచలోని గిరిజన సంక్షేమ శాఖ బాలుర ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల కోసం నిర్వహిస్తున్న శిక్షణా తరగతులను మంగళవారం ఆయన పరిశీలించారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు ఏయే సబ్జెక్టులో ఫెయిల్ అయ్యారో ఆయా సబ్జెక్టులకు సంబంధించిన అంశాలపై విద్యార్థులు పూర్తి స్థాయిలో సన్నద్ధమయ్యేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఏపీవో జనరల్ డేవిడ్‌రాజు, హెచ్ఎం భద్రు, వార్డెన్ ప్రమోద్, సబ్జెక్టు టీచర్లు పాల్గొన్నారు.

శిక్షణ తరగతుల్లో విద్యార్థులతో మాట్లాడుతున్న పీవో



## ఇందిరా మహిళా డెయిరీ కార్యాచరణను వేగిరం చేయాలి

**'డెయిరీ, ఆర్‌వైవీ, మహిళా మార్ట్' సమీక్షలో కలెక్టర్**



అధికారులతో సమీక్షిస్తున్న ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

మామిళ్లగూడెం, మే 27: ఇందిరా మహిళా డెయిరీకి సంబంధించిన కార్యాచరణను వేగవంతం చేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజతో కలిసి ఇందిరా మహిళా డెయిరీ, రాజీవ్ యువ వికాసం (ఆర్‌వైవీ), మహిళా మార్ట్ ప్రారంభోత్సవంపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరా డెయిరీ లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. యూనిట్ల కోసం పశుగ్రాసం పెంపకానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఇదివరకు ఉన్న గేదెలు పాల ఉత్పత్తి పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల వివరాలు కార్పొరేషన్ బ్యాంకుల వారీగా సిద్ధం చేయాలన్నారు. స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించిన తరువాత బ్యాంకులకు అందించాలన్నారు. ఇప్పటివరకు 7,722 ప్రతిపాదనలు బ్యాంకులకు అందించామని, వాటిలో 5,183 వాటికి సమ్మతి అందించినట్లు తెలిపారు. జూన్ రెండో తేదీన అన్నివర్గాలకు సంబంధించి మంజూరు చేయాలని అన్నారు. ఖమ్మం నగరంలో అన్ని హంగులతో మహిళా మార్ట్ ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉందని తెలిపారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.